సంక్షిప్త వార్తలు

దీక్షలకు హైకోర్టు న్యాయవాదుల మద్దతు

పొన్నూరు: పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పట్టణ పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు హైకోర్టు న్యాయవాదులు గురువారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పాలేటి రమేష్, పెరికల డానియేల్ మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. లేక పోలీసుల రాజ్యంలో ఉన్నామా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. సంఘటనకు బాధ్యులైన సీఐ, డాక్టర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల సత్తా చూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి. మురళీబాబు, కోటి నాగులు, దుర్గారావు, ఎం. కుమార్, నాసరమ్మ పాల్గొన్నారు.

అర్చకునిపై దాడి చేసిన వారిని శిక్షించాలి



పొన్నూరు: పట్టణంలోని శ్రీ నాగేంద్రస్వామి ఆలయం అర్చకుడు నూతలపాటి నాగేశ్వరశర్మపై దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ గురువారం బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో పట్టణంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పులిపాక ప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలో పూజలు చేసే సమయంలో అకారణంగా ఒక వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడుతూ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు వెంటనే అర్చకునిపై దాడిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకొని, బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పట్టణ సీఐ రవి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో ఎలైట్ బ్రాహ్మిన్స్ వ్యవస్థాపకులు ఏలేశ్వరపు జగన్‌మోహన్‌రాజు, సమాఖ్య కోశాధికారి పి. పురుషోత్తంశర్మ, లక్కరాజు లక్ష్మణరావు, పొన్నూరు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి రాష్ట్రాల కార్యదర్శి అనిల్ బెహరా, అర్చకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని నిబద్ధతతో చేయాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు



గుంటూరు రూరల్: నగరంలోని ఎంపీడీవో కార్యాలయంలో గల కృషి భవన్‌లో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డీపీఎం రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు ఎస్‌పీఎమ్‌యూ డిస్టిక్ యాంకర్ గోపీచంద్, జిల్లా వ్యవసాయశాఖ అగ్రికల్చర్ ఆఫీసర్ నున్న వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని నిబద్ధతతో చేయాలని తెలిపారు. 2025 పీఎమ్‌డీఎస్ ప్లాన్ గురించి వివరించారు. రైతులతో పీఎమ్‌డీలు చేయించాలని సూచించారు. సిబ్బంది అంతా వారి పరిధిలోని రైతులందరికీ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పీఎమ్‌డీలు, ఏడీఏలు ఆధ్వర్యంలో ప్రతి రైతుకు కిట్లు అందజేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతుల వివరాలు ప్రతి ఆర్‌ఎస్‌కేలో ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

కాకుమాను: కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కాకుమాను మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. పొంగళ్లు పొంగించి, భోగి మంటలు వేసి వేడుకలను నిర్వహించారు. ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్‌లు భోగి మంటలు వెలిగించి విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ పెదనందిపాడు శ్రీనివాస స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆవరణలో భోగి మంటలు వెలిగించారు. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు నర్రా బాలకృష్ణ, ఉపాధ్యక్షులు రాఘవయ్య, సత్యం, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ విద్యాసాగర్ గుప్తా పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి బైక్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో గురువారం జరిగింది. బాపట్ల ప్రాంతానికి చెందిన కె. రామకృష్ణ నారాకోడూరులోని రుచి రెస్టారెంట్ సమీపంలో జీబీసీ రహదారి పక్కన నడిచి వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తూ బైక్ ఢీ కొట్టడంతో నడుంకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు బైక్‌లు ఢీ కనటంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో గురువారం జరిగింది. చేబ్రోలు చీలిపాలెం గ్రామానికి చెందిన ప్రేమసాగరబాబు స్థానిక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. బైక్‌పై తెనాలి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ సంఘటనలో ప్రేమ్‌సాగరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ముఖానికి, కాళ్లు, చేతులకు గాయాలవటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి శ్రీ పుట్టలమ్మ తల్లి సంక్రాంతి సంబరాలు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ ఘంటాలమ్మ శ్రీపుట్టలమ్మతల్లి సంక్రాంతి సంబరాలు శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి ఇంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాల్లో భాగంగా 10వ తేదీ, 11వ తేదీలలో ఆలయ ప్రాంగణంలో జూనియర్, సీనియర్ స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తారని పేర్కొన్నారు. 12న మధ్యాహ్నం 2 గంటలనుంచి మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తారని తెలియజేశారు. పాల్గొనాలనుకునే మహిళలు 9490642637, 9848454568, 7386242526 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రత్తిపాడు: స్థానిక ఎరువుల దుకాణాల్లో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర ట్రేడర్స్, లక్ష్మీపరమేశ్వర ట్రేడర్స్, శ్రీరామ ట్రేడర్స్‌లో అధికారుల బృందం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు చేసింది. ఓ- ఫారం లేకుండా అమ్మకాలు చేస్తున్న రూ. 41,300 విలువ చేసే సరుకును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

పెదకాకాని: పేదలకు పట్టణాలు, గ్రామాల్లో స్థలాలతో పాటు ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరుతూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పెదకాకాని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి పాల్గొన్నారు.

నేడు రూరల్ మండల సమీక్ష సమావేశం

గుంటూరు రూరల్: రూరల్ మండల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొంటారన్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

రీ సర్వేతో రైతుల భూ సమస్యలకు పరిష్కారం

పాంద్రపాడు(కాకుమాను): మండలంలోని పాంద్రపాడులో గురువారం భూ రీసర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.వెంకటస్వామి ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి హద్దులు, హక్కులను నమోదు చేయడమే రీసర్వే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, గ్రామ సభ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లిలో ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఎస్ డీటీ వెంకట్రావు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేసేందుకు నిల్వ చేసిన 9.43 క్వింటాళ్ల పీడీయస్ బియ్యాని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న రేణుకయ్యపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడు: ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. స్థానిక ఎస్ఆర్‌ఎస్ రెయిన్ బో స్కూల్, అక్షయ పాఠశాల, శ్రీనివాస హైస్కూల్స్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. రెయిన్ బో స్కూల్లో చైర్మన్ చిన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి వేడుకలకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై భోగి మంటలు వెలిగించారు. శ్రీనివాస హైస్కూల్‌లో డైరెక్టర్ బాపతు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. అక్షయ విద్యాలయం కరెస్పాండెంట్ వెలగా రాఘవయ్య చౌదరి నేతృత్వంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఆయా పాఠశాలల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల గాన కీర్తనలు, రంగురంగుల రంగవల్లులు, సంక్రాంతి లక్ష్మి వేష ధారణ, కోలాట ప్రదర్శనలు అలరించాయి.

బాలల హక్కులపై కళాజాతా ప్రదర్శన

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నడింపాలెంలో గురువారం సాయంత్రం బాలల హక్కులపై కళాజాతా బృందం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాల నిషేధం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్..వంటి వివిధ అంశాలపై పాటలు, నాటికలు, పద్యాల రూపంలో కళాకారుల బృందం ప్రజలకు ప్రధాన కూడళ్ల వద్ద వినిపించారు. కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్లు మాధవి, భారతి పర్యవేక్షించారు. కార్యక్రమంలోఅంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల అకౌంట్లకు 'తల్లికి వందనం' జమ

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు: తల్లికి వందనం నగదును నేరుగా పాఠశాలల అకౌంట్లకు జమ చేస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఎస్ఆర్‌ఎస్ రెయిన్‌బో పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ వచ్చే నెల లేదా రెండు నెలల్లో ప్రతి తల్లికీ ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. ఇద్దరు పిల్లలంటే ఫీజు నేరుగా స్కూల్ యాజమాన్యం ఖాతాలో పడిపోతుందని చెప్పారు. ఒకవేళ ఫీజు తక్కువగా ఉంటే మిగిలిన డబ్బులు యాజమాన్యం వెనక్కు ఇస్తుందని చెప్పారు. ఇంటర్మీడియట్ వరకూ తల్లికి వందనం ఉంటుందని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ప్రత్తిపాడు: సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన శాఖల వారీగా సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. మండలాన్ని అన్ని అంశాల్లో ప్రగతి పథంలో నిలపాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అందరికీ కచ్చితంగా ఒకటో తేదీలోపల జీతాలు వారికి అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె. శివపార్వతిని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ జి. కరుణకుమార్, ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం పాతమల్లాయపాలెం మేజర్, వంకాయలపాడు మేజర్ కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనులను స్థానిక నాయకులు, నీటి సంఘాల అధ్యక్షులతో కలిసి పరిశీలించారు.

అభివృద్ధి పథంలో పొన్నూరు



పొన్నూరులో ప్రసిద్ధిగాంచిన శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయం



విస్తరణతో విశాలంగా పొన్నూరు ప్రధాన రహదారి

- విద్యా, వైద్య రంగాలలో ముందంజ
- 29 గ్రామాలకు వ్యాపార కేంద్రం
- జోరుగా అమ్మకాలు

పొన్నూరు: నేడు అన్ని రంగాల్లో పొన్నూరు అభివృద్ధి చెందింది. ప్రధానంగా విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో ముందడుగు వేసింది. పట్టణంలో ప్రసిద్ధ దేవాలయాలైన శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి, సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయాలతో ఆధ్యాత్మికత విరాజిల్లుతోంది. ప్రధాన పట్టణాలైన రేపల్లె, బాపట్ల, చీరాల, గుంటూరులకు వెళ్లే మార్గాలకు ముఖ్య కేంద్రంగా మారింది. మండలంలోని 29 గ్రామాలతో పాటు ఇతర మండలాల ప్రజలకు వ్యాపార కేంద్రంగా నిలిచింది. ఐలాండ్ సెంటర్, జీబీసీ రోడ్డు, ఎస్బీబీ రోడ్డులలోని వ్యాపార సంస్థలు కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటాయి. దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ తలనొప్పి తగ్గింది. విశాలంగా మారిన రహదారితో సమస్య పూర్తిగా తీరింది.

భేషుగ్గా వ్యాపార రంగం

పట్టణంలో విశాల భవనాలు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి. సూపర్‌మార్కెట్, టీవీ, సెల్‌ఫోన్, హోమ్ ఫర్నీచర్ వంటి కార్పొరేట్ స్థాయి షోరూంలు పొన్నూరులో వెలిశాయి. సమీప గ్రామాల ప్రజలు తరచూ ఇక్కడికి వస్తుండటంతో అన్ని వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. విద్యా రంగంలో పలు కార్పొరేట్ స్కూల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా విధానాలు ఈ ప్రాంత విద్యార్థులకు అందుతున్నాయి.

మెరుగైన వైద్యసేవలు


నిబద్ధత, నిష్ణాతులైన వైద్యులు ఉండటంతో వైద్య సేవలకు పొన్నూరు ప్రఖ్యాతిగాంచింది. పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు వైద్య సేవలకు ఇక్కడకు వస్తుంటారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పేరు గాంచిన పలు కోచింగ్ సెంటర్లు, శుభకార్యాలు నిర్వహించేందుకు అధునాతన ఫంక్షన్ హాల్స్ అందుబాటులో ఉన్నాయి. వ్యవ సాయ రంగంలోనూ పొన్నూరు మేటిగా ఉంది. ఈ ప్రాంతంలోని సుమారు 30 వేల ఎకరాల్లో వరి, మినుము, వేరుశనగ, జొన్న, మొక్క జొన్నలతో పాటు పలు రకాల పూల సాగులను రైతులు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

ఆధ్యాత్మికతకు నెలవు

పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వారి దివ్య రథోత్సవం ప్రతి యేటా అంగరంగ వైభవంగా జరుగుతుంది. పలు జిల్లాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకుంటారు. ప్రసిద్ధ ఆలయాల్లో ఒకటైన శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అనేక రాష్ట్రాల నుంచి ప్రముఖులు, భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కట్టెంపూడిలోని శ్రీ నాగేంద్రస్వామి(పుట్ట) దేవస్థానానికి ఎంతో ప్రత్యేకత ఉంది. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటే అనేక సమస్యలు తీరుతాయని చెబుతుంటారు. నాగుల చవితి వేడుకలు ఈ ఆలయంలో వైభవంగా నిర్వహిస్తారు.



కోటి రూపాయలతో నిర్మించిన మున్సిపల్ పార్కు



ప్రసిద్ధ సహస్ర లింగేశ్వర, వీరాంజనేయ స్వామి ఆలయం